గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్పీ

ఆసిఫాబాద్, ఆగస్టు 30: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరిగేలా చూడాలని ఎస్పీ డీవీ శ్రీనివాస్ ఒకప్రకటనలో పేర్కొన్నారు. గణేష్‌మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ముందుగా ఒకరి పేరు ద్వారా పోలీసు పోర్టల్‌లో tspolice.gov.in వెబ్‌సైట్ ద్వారా ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జనం తేదీ, ప్రదేశం తదితర సమాచారంతో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం దరఖాస్తు కాపీని సంబంధిత పోలీసుస్టేషన్‌లో సమర్పించి పర్మిషన్ పత్రాన్ని తీసుకోవాలన్నారు.

ఐఐటీ విద్యార్థికి ఆర్థిక సహాయం అందించాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 30: వాంకిడి మండలంలోని ప్రభుత్వకళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన దుర్గం అర్జున్ జేఈఈ మెయిన్స్ పరీక్షరాసి 1782వ ర్యాంకు సాధించి జోద్‌పూర్ ఐఐటీ కళాశాలలో సీటు సాధించాడు. అతనికి ఎస్సీకార్పొరేషన్‌ద్వారా ఆర్థిక సాయం అందించాలని శుక్రవారం ఎస్సీ అభివృద్ధి అధికారి సజీవన్‌కు డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులుకార్తీక్,దినకర్,జ్యోతిపాల్గొన్నారు.

ఓటరు జాబితాను సిద్ధం చేయాలి

జైనూర్, ఆగస్టు 30: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సత్వరమే ఓటరు జాబితాను సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ కోరారు. కార్యక్రమంలో మండలంలోని బీఎల్‌వోలు పాల్గొన్నారు.



మున్సిపాలిటీలో కీలక పోస్టులన్నీ ఖాళీ

- భర్తీకాక ప్రజలకు ఇబ్బందులు
- ఇన్‌చార్జీలతోనే కొనసాగుతున్న పనులు

కాగజ్‌నగర్, ఆగస్టు 30: కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో కీలక పోస్టులన్నీ ఖాళీలుగా ఉన్నాయి. ఈ మున్సిపాల్టీలో 71పోస్టులు ఉండగా, ఇందులో ప్రస్తుతం 51మంది ఉద్యోగులు వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్నారు. ఇంకా 20పోస్టులు ఖాళీలుగానే ఉన్నాయి. పూర్తి స్థాయిలో సిబ్బందికి లేకపోవటంతో ఇన్‌చార్జీలతోనే వెళ్లదీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. శానిటరీ జవాను 2పోస్టులు ఉండగా ఇందులో 1 ఖాళీగా ఉంది. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు 2ఉండగా, అందులో ఒకటి ఖాళీగా ఉంది. అలాగే సీనియర్ అసిస్టెంట్‌లు 4 పోస్టులు ఉండగా, ఒక పోస్టు ఖాళీ ఉంది. జూనియర్ అసిస్టెంట్లు ఏడు పోస్టులుండగా, ఇందులో మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాచ్‌మెన్ పోస్టులు రెండు ఉండగా, ఒక పోస్టు ఖాళీగా ఉంది. పబ్లిక్ హెల్త్ వర్కర్స్ 34మంది ఉండాల్సి ఉండగా, ఇందులో 12పోస్టులు ఖాళీగా లున్నాయి. అటెండర్లు ముగ్గురు ఉండాల్సి ఉండగా, ఒక పోస్టు ఖాళీ ఉంది. ఇంతవరకు ఆయా ఖాళీల్లో ఎవరినీ భర్తీ చేయలేదు. పట్టణంలోని టౌన్ ప్లానింగ్ పోస్టులో పనిచేస్తున్న అధికారి యశ్వంత్ ఇన్‌చార్జీగా కొనసాగుతున్నారు. ఆయన కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, డీటీసీపీవో, నస్పూర్, ఆదిలాబాద్, చెన్నూరు మున్సిపాల్టీలకు ఇన్‌చార్జీగా విధులు నిర్వహిస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారి పట్టణంలో నూతన ఇళ్ల నిర్మాణానికి అనుమతుల కోసం విచారణ చేయటం, ఆక్రమణల తొలగించాల్సి ఉంటుంది. ఇంతటి ముఖ్యమైన స్థానానికే ఇన్‌చార్జి అధికారి కేటాయించారు. దీంతో కొన్ని సందర్భాల్లో పనులు ముందుకు సాగక పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా టెక్నికల్ అధికారి మధు ఇక్కడ పనిచేయాల్సి ఉండగా నస్పూర్ మున్సిపాల్టీలో ఇన్‌చార్జీగా కొనసాగుతున్నారు. ఈ మధ్య వర్షాలు కురవడంతో వివిధ వార్డుల్లో పారిశుద్యం పేరుకుపోయింది. దీనిని శుభ్రం చేయించాల్సిన బాధ్యత శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై ఉంటుంది. ఆయా పోస్టులో ఒక్కరే ఉన్నారు. మరొకటి ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జీతో కొనసాగిస్తున్నారు. ఇన్‌చార్జిల పాలన కొనసాగుతండటంతో పట్టణ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆస్తి పన్ను వసూలు సమయంలో కూడా పూర్తి సిబ్బంది లేక పోవటంతో వివిధ శాఖల్లో పనిచేసే సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వసూళ్ల కోసం పంపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిసాయిలో అధికారులను కేటాయించి మున్సిపల్ పురోభివృద్ధికి కృషి చేయాలని పట్టణవాసులు డిమాండు చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..
-అంజయ్య, మున్సిపల్ కమిషనర్, కాగజ్‌నగర్



మున్సిపాల్టీలో 71పోస్టులు ఉండగా, ఇందులో 50మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇంకా 20పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కీలక పోస్టులు ఇన్‌చార్జిలతో నడిపిస్తున్నాం. పనులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే హరీష్ బాబు


చెక్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, ఆగస్టు 30: రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద మంజూరు చేసే ఆర్థికసహాయాన్నిలబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ త్రిశూల్‌పహాడ్‌పై లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్‌ల పంపిణీ చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ షమీన్ సుల్తానా, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆయావార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

కాగజ్‌నగర్, ఆగస్టు 30: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కరాటే, కుంగ్‌ఫూ జిల్లా స్థాయి ఎంపికపోటీలు కాగజ్‌నగర్ ఫాతిమా కాన్వెంటు పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఎంపికైన వారి వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ సాంబశివ రావు ప్రకటించారు. అండర్-17బాలుర విభాగం కరాటేలో 50కిలోల విభాగంలో ఎండీ జీషాన్, ఫైజాన్ 53కిలోల విభాగంలో ఎంపికైనట్టు, పి.వినోద్ 48కిలోలు, రితేష్ 70కిలోల విభాగంలో, నవనీత్ చంద్ర 34కిలోల విభాగంలో ఎంపికైనట్టు తెలిపారు. అలాగే అండర్-17బాలికల విభాగంలో జి విజయ 49కిలోల విభాగంలో, తనూష 52 కిలోల భాగంలో, 40కిలోల బిభాగంలో బిందుషా ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఎంపికైనా క్రీడాకారులు జోనల్‌స్థాయిలో క్రీడల్లోపాల్గొననున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ సాఫల్య, కోచ్ గ్రాండ్ మాస్టర్ రవి, కరాటే దేవయ్య, ఉష, ఏడుకొండలు పాల్గొన్నారు.



జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

ఆదర్శం పూలాజీబాబా జీవితం: కలెక్టర్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే తదితరులు


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

జైనూర్, ఆగస్టు 30: పూలాజీబాబా జీవితం ఆచరణీయం, ఆదర్శనీయమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జైనూర్ మండలం పట్నాపూర్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన పూలాజీబాబా 100వ జయంతి మహోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని భక్తులను ద్దేశించి మాట్లాడారు. ధ్యానంతో కోపం, ఆవేశాలను అణిచివేసుకొని, ప్రతిసందర్భాన్ని ప్రశాంతంగా నిర్వహించే సమర్థతను పులాజీబాబా సాధించారన్నారు. అదేవిధంగా ప్రతిఒక్కరూ తమ దైనందిన జీవి తంలో వ్యాయామం, ధ్యానం కోసం కొంత సమయాన్ని కేటాయిస్తే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ పూలాజీబాబా జయంతి వేడుకలకు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అస్సాం, మధ్యప్రదేశ్,మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పూలాజీబాబా ప్రబోధనలు భావితరాలకు ప్రసరింపజేయాలని కోరారు. ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్త మాట్లాడుతూ ఉమ్మడిఆదిలాబాద్ జిల్లాలో నివసిస్తున్న గిరిజనుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావ్ మాట్లాడుతూ పట్నాపూర్ సిద్ధేశ్వర్ ప్రాంగణంలో వేలాదిభక్తులు శాంతియుతంగా వేడుక జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు కలెక్టర్ వెంకటేష్‌దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావ్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్త, అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు తదితరులకు పులా జీబాబా చిత్రపటాలను బహూకరించి సన్మానించారు. అంతకుముందువారు పూలాజీబాబా సమాధి మందిరంలో పూజలు చేశారు. కార్యక్రమంలో పట్నాపూర్ సిద్ధేశ్వర్‌సంస్థాన్ అధ్యక్షుడు ఇంగ్లేకేశవ్‌రావ్, గౌరవ అధ్యక్షుడు ఇంగ్లేవామన్‌రావ్, పూలాజీబాబా సతీమణి ఇంగ్లే ద్రుపదబాయి, జిల్లా కార్యదర్శి దుర్కె సుభాష్, అంద్ సమాజ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ముకాడె విష్ణు, రాష్ట్రఅధ్యక్షుడు కుడె కైలాస్, జిల్లా కార్యదర్శి గారులె నారాయణ, సంస్థాన్ కమిటీ సభ్యులు, ఏఎస్పీ ప్రభాకర్, డీఎస్పీ సదయ్య, సీఐ రమేష్, ఎస్ఐ సాగర్, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన భక్తులు

ప్రాణహిత ప్రాజెక్టును వెంటనే నిర్మించాలి

- తెలంగాణ జల సాధన సమితి అధ్యక్షుడు నైనాల గోవర్ధన్

సిర్పూర్(టి), ఆగస్టు 30: కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టును వెంటనే నిర్మించాలని తెలంగాణ జలసాధన సమితి అధ్యక్షుడు నైనాల గోవర్ధన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిర్పూర్(టి) మండలకేంద్రంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాణహిత ప్రాజెక్టును కాళేశ్వరా నికి తరలించడంలో మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ అధినేత కృష్ణారెడ్డి హస్తం ఉందన్నారు. రాష్ట్ర అప్పును రూ.70వేల కోట్ల నుంచి రూ.7లక్షల కోట్లకు పెంచడంలో ఆయన ఎనలేని కృషి చేశారని ఎద్దేవా చేశారు. తద్వారా రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టారని, కేసీ ఆర్ కుటుంబం మొత్తంగా కాళేశ్వరాన్ని అడ్డం పెట్టుకొని అక్రమంగా సంపాదించిందని ఆరోపించారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ ఈ వార్షికబడ్జెట్‌లో కేవలం రూ.250కోట్లు ప్రాణహిత ప్రాజెక్టుకు కేటాయించి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. వెంటనే డీపీఆర్ సిద్ధంచేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. తూర్పు ఆదిలాబాద్ జిల్లాలోని అయిదు నియోజకవర్గాలకు నీళ్లు ఇచ్చిన తరువాతనే హైదరాబాద్ నగరానికి, దక్షిణతెలంగాణకు నీటిని తరలించాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రాజేందర్ గౌడ్, శంకర్, మల్లయ్య, మోతీరాం, తుకారాం, అశోక్, నాని, ప్రశాంత్, సాయి, జావీద్, శ్రీను, నానాజీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నైనాల గోవర్ధన్

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 30: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సెప్టెంబరు10 నుంచి నిర్వహించనున్న సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం ఒక ప్రకటనలో తెలిపారు. 10న మూగ, చెవిటి, మానసికవైకల్యం వారికి, 17న కంటి సమస్యల వారికి, 21న ఎముకలు, 24న ఎముకలకు సంబంధించి దివ్యాంగులకు వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దివ్యాంగులు వికలత్వ పరీక్ష చేయించుకుని స్లాట్ బుక్ చేసుకుని క్యాంపునకు రావాలన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో

సిర్పూర్(టి), ఆగస్టు 30: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలను శుక్రవారం డీఈవో అశోక్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు పాఠాన్ని బోధించారు. విద్యార్థులను ప్రశ్నలను అడిగి జవాబు రాబట్టి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం లోనవెళ్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీచేశారు. అనుమతిలేకుండా ప్రధానోపాధ్యాయుడు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐఎఫ్‌పీ ప్యానెల్ టీవీలలో బోధనచేయాలని ఉన్నప్పటికీ దానిని వాడకుండా నిరుపయోగంగా పడేయడాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రేపటిలోగా టీవీలని వాడకంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుని ఫొటోలను పంపించాలని ఆదేశించారు. మధ్యాహ్నభోజనం మెనూప్రకారం పెట్టాలన్నారు. వారానికి మూడు గుడ్లు అందించాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బండయ్యకు సూచించారు. పాఠశాల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అదేపాఠశాల పరిధిలో ఉన్న బాలుర ప్రాథమిక పాఠశాలను తనిఖీచేయగా పాఠశాల ఫేషియల్ అటెండెన్స్ తీయకపోవడం, టైంటేబుల్, రికార్డులు, కరెంటుసౌకర్యం ఏమీ లేకపోవడంతో ప్రధానోపాధ్యా యులపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తంచేశారు. పాఠశాల గ్రాంటులను ఉపయోగించి వెంటనే కరెంటు పునరుద్ధరించాలని ఆదేశించారు. డీఈవోవెంట జిల్లాసైన్స్ అధికారి మధుకర్, హెచ్ఎం ప్రమీల, సదాశివుడు, సీఆర్పీలు పవన్, రాజేష్ తదితరులున్నారు.


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న డీఈవో అశోక్

కల్వర్టును ఢీకొని కారు దగ్ధం


దగ్ధమైన కారు

సిర్పూర్(టి), ఆగస్టు 30: మండలంలోని వెంపల్లి సమీపంలో సిర్పూర్(టి)- కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై గురువారం రాత్రి ప్రమాదవశాత్తు కారు దగ్ధమైంది. చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్‌కు చెందిన వాసుదేవ చక్రవర్తి కారులో తన అత్తమ్మను కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో దింపి వస్తున్న క్రమంలో వెంపల్లి సమీపంలో అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. అనంతరం ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. అయితే కారులో ఉన్న వాసుదేవ చక్రవర్తి, డ్రైవర్ సంజు అప్పటికే బయటికివచ్చారు. వాసుదేవ చక్రవర్తికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని అగ్నిమాపక యంత్రంతో మంటలు ఆర్పారు.

ఎమ్మెల్యేను పరామర్శించిన ఎమ్మెల్సీ


ఎమ్మెల్యే కోవ లక్ష్మిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 30: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో గురువారం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమెను శుక్రవారం ఎమ్మెల్సీ దండె విఠల్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమెఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



భూనిర్వాసితులను ఆదుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు

రెబ్బెన, ఆగస్టు 30: సింగరేణి కోసం భూములు కోల్పోయిన వారిని యాజమాన్యం వెంటనే ఆదుకోవాలని హెచ్ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్‌ప్రెసిడెంట్ పత్తెం రాజబాబు శుక్రవారం సింగరేణి సీహెచ్‌పీ అధికారి కోటయ్యకు వినతిపత్రం అందజేశారు. గోలేటి సీహెచ్‌పీలో భూనిర్వాసితులు పదిసంవత్సరాలుగా కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. ఇప్పుడు ఆ కాంట్రాక్టు రద్దు చేయటం వల్ల భూ నిర్వాసితులకు ఆధారం లేకుండా పోయిందన్నారు. వెంటనే వారికి వెంటనే తిరిగి అవకాశం కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా ఆర్గనైజింగ్ కార్యదర్శి శంకరమ్మ, రాజేశ్వరి, నాగరాణి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

2,364మందికి జనరల్ మజ్దూర్లుగా పదోన్నతి

- త్వరలో ఉత్తర్వులు
- సీఎండీ ఎన్ బలరాం

శ్రీరాంపూర్, ఆగస్టు 30: సింగరేణిలో పనిచేస్తున్న 2364మంది బదిలీవర్కర్లకు జనరల్‌మజ్దూర్లుగా పదోన్నతి కల్పించనున్నట్లు సీఎండీ ఎన్ బలరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఏదైనా ఒకఏడాదిలో అండర్‌గ్రౌండ్‌లో 190మస్టర్లు, సర్ఫేస్‌లో 240మస్టర్లు కలిగి ఉన్న బదిలీవర్కర్లు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. కార్పొరేట్ ఏరియాలో 25మంది, కొత్తగూడెంలో 17మంది, ఇల్లందులో 9మంది, మణుగూరులో 21మంది, భూపాలపల్లిలో 476మంది, రామగుండం-1 ఏరియాలో 563మంది, రామగుండం-2ఏరియాలో 50మంది, రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో 240మంది, శ్రీరాంపూర్‌ఏరియాలో 655మంది, మందమర్రిఏరియాలో 299మంది, బెల్లంపల్లి ఏరియాలో 9మందిని రెగ్యులరైజ్ చేయబోతున్నామన్నారు. అలాగే క్వార్టర్లకేటాయింపులో ప్రాధాన్యం ఉంటుందన్నారు. పదోన్నతిపొందిన ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని, విధులకు గైర్హాజరుకావద్దని సూచించారు. ఈఏడాది కంపెనీలో వెయ్యికిపైగా ఉద్యోగాలను ఇంటర్నల్ విధానంలో భర్తీచేయబోతున్నట్లు చెప్పారు. అర్హులకు ఇది ఒకమంచి అవకాశమనిఆయన తెలిపారు.

'కార్మికుల హక్కుల సాధనే లక్ష్యం'

మందమర్రిటౌన్, ఆగస్టు 30: కార్మికుల హక్కుల సాధనే తమ లక్ష్యమని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కంది శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఏరియాలోని కేకే5 గనిపై కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థకు వచ్చినలాభాలను ప్రకటించివెంటనే కార్మికులకు 35 శాతం లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిట్‌కార్యదర్శి గాండ్ల సంపత్, సమ్మయ్య, సంతోష్, ప్రేమ్‌లాల్, శ్రీకాంత్, చంద్రశేఖర్,నాగేశ్వర్‌రావు, కొండయ్య, సంపత్, భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సమావేశాలు నిర్వహించాలి'

కాసిపేట, ఆగస్టు 30: సింగరేణిలోని అన్ని కార్మిక సంఘాలతో సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మంద నర్సింహారావు అన్నారు. శుక్రవారం కాసిపేట గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో గెలిచిన గుర్తింపు సంఘానికి ఇప్పటివరకు గుర్తింపుపత్రం ఇవ్వకపోవడంతో కార్మిక సమస్యలపై అన్ని కార్మిక సంఘాలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. అనంతరం పలువురు సీఐటీయూలో చేరగా వారికి కండువాలు కప్పారు. కార్యక్ర మంలో నాయకులు వెంకటస్వామి, అల్లి రాజేందర్, రామగిరి రామస్వామి, భరత్, తదితరులు పాల్గొన్నారు.

'వర్క్‌షాప్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి'

శ్రీరాంపూర్, ఆగస్టు 30: ఏరియా వర్క్‌షాప్ కార్మికులసమస్యలు పరిష్కరించాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్ రెడ్డి కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం కార్మికులతో కలిసి డీజీఎం రవీందర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, ఇటీవల సింగరేణి ఉద్యోగుల వ్యక్తిగత సమాచారాన్ని ఆన్‌లైన్ చేయడంలో తప్పులు దొర్లాయన్నారు. అందుకే సిబ్బందిని వర్క్‌షాప్‌లో నియమించి సరిచేయాలన్నారు. మహిళా కార్మికులకు వాష్‌రూమ్‌లు, రెస్ట్‌హాళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిట్‌కార్యదర్శి పొన్నగంటి అశోక్, కేంద్రఆర్గనైజింగ్ కార్యదర్శి దుర్గం లక్ష్మణ్, కార్మికులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై బీఎల్‌వోలకు శిక్షణ

లింగాపూర్, ఆగస్టు 30: ఓటరునమోదుపై బీఎల్‌వోలకు తహసీల్దార్‌కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ రాజేంద్ర ప్రసాద్‌వర్మ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బీఎల్‌వోయాప్‌లో ఓటరునమోదు ఏవిధంగా చేయాలి అనేఅంశాలపై శిక్షణనిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీతహసీల్దార్ పెద్దయ్య, ఆర్ఐప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఒకరి రిమాండ్

భీమారం, ఆగస్టు 30: మండలంలోని అంకుశాపూర్ గ్రామానికి చెందిన పల్ల మురళికి చెన్నూరు కోర్టు జడ్జి 11 రోజులు రిమాండ్ విధించగా ఆది లాబాద్ జైలుకు తరలించినట్లు మంచిర్యాల ఎఫ్ఆర్‌వో రత్నాకర్‌రావు తెలి పారు. మురళి 2021లో పోలంపల్లి కంపార్టుమెంట్‌లోని భూమిలో చెట్లు నరికినందుకు మరళిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు. కోర్టుకు వాయిదాల ప్రకారం హాజరు కాకపోవడంతో శుక్రవారం జడ్జి 11 రోజులు రిమాండ్ చేసి ఆదిలాబాద్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

టీఎస్ఆర్‌టీసీ కార్గో సెంటర్ ప్రారంభం

శ్రీరాంపూర్, ఆగస్టు 30: శ్రీరాంపూర్ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన టీఎస్ఆర్‌టీసీ కార్గో సెంటర్‌ను లాజిస్టిక్ మేనేజర్ బి.పాల్, డిపో మేనేజర్ జనార్దన్ శుక్రవారం ప్రారంభించారు. కార్గో సేల్స్ టీం సభ్యులు కె. సాయన్న, ఎం. మహేశ్వర్, బి. రమేష్, వీసీసీ ఏజెంట్ కె.శైలజ పాల్గొన్నారు.

స్క్రాప్ దొంగతనం కేసులో ఒకరి అరెస్టు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 30: పట్టణంలోని ఎంసీసీ కంపెనీలో స్క్రాప్ దొంగతనం చేసిన గుమ్మడి సారయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. రాజీవ్‌నగర్‌కు చెందిన సారయ్య శుక్రవారం ఉదయం కంపెనీలోకి ప్రవేశించి స్క్రాప్‌ను దొంగిలించాడు. సెక్యూరిటీ గార్డు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తును ప్రారంభించగా సాయంత్రం బెల్లంపల్లి చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై వెల్లడించారు.

ప్రయాణికులను ఇబ్బంది పెట్టిన వ్యక్తిపై కేసు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 30: మంచిర్యాల ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ప్రయాణికులను మద్యం మత్తులో ఇబ్బందులకు గురిచేసిన వసాక పున్నం అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సనత్ కుమార్ తెలి పారు. పట్టణానికి చెందిన పున్నం శుక్రవారం బస్‌స్టేషన్‌లో ప్రయాణికు లను ఇబ్బందులకు గురి చేశాడు. దీంతో కంట్రోలర్ సమాచారం అం దించగా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా అమ్మితే చర్యలు

మందమర్రిరూరల్, ఆగస్టు 30: గుడుంబా అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఎక్సైజ్ ఎస్ఐశారద గుడుంబా అమ్మేవారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

అంటరానితనాన్ని రూపుమాపాలి

మందమర్రిరూరల్, ఆగస్టు 30: అంటరానితనాన్ని రూపుమాపాలని తహసీల్దార్ సతీష్‌కుమార్ సూచించారు. శుక్రవారం పొన్నారం పంచాయతీ కార్యాలయంలో పౌరహక్కులదినోత్సవాన్ని నిర్వహించారు.ప్రతీ ఒక్కరికి జీవించే హక్కు ఉంటుందని తెలిపారు.అందరుకలిసిమెలిసి ఉండాలన్నారు.

జైపూర్: బెజ్జాల గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీసభ్యులు వెంకటేశం, దశరథం, ఎస్డ బ్ల్యూవో రవీందర్‌గౌడ్‌లు పాల్గొని పౌరుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లోని ప్రజలందరు కలిసి మెలిసి ఉండాలని, ఎలాంటి గొడవలకు వెళ్లవద్దని సూచించారు.

పైసలిస్తేనే పట్టా చేస్తున్నారు

కన్నెపల్లి, ఆగస్టు 30: తహసీల్దార్ కార్యాలయంలో పైసలిస్తేనే పట్టాలు చేస్తున్నారని కన్నెపల్లి గ్రామానికిచెందిన పోలాజి మొండి అనేరైతు శుక్ర వారం ఒక ప్రకటనలో ఆరోపించారు. తనమామ పందిళ్ల జయరాం పేరుపై సర్వే నంబరు 86/ఆ/1లో 8గుంటల భూమిఉంది. ఇందులో నుంచి తన పేరుమీద 4గుంటల భూమిని పట్టాచేయాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ను సంప్రదించగా 4గుంటల భూమిని పట్టాచేయలేమన్నాడు. కానీ శుక్ర వారం ముగ్గురు వ్యక్తులకు రెండున్నర గుంటల చొప్పున తహసీల్దార్ పట్టా చేశారని, ఇది ఎలా చేశారని పేర్కొన్నాడు. డబ్బులు ఇచ్చిన వారికే పట్టాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈవిషయంపై మండల తహసీల్దార్ శ్రావణ్‌కు మార్‌ను సంప్రదించగా వ్యవసాయభూమికి సంబంధించి గుంటల లెక్కన భూమిని రిజిస్ట్రేషన్ చేస్తున్నామని, నివాసప్రాంతాల భూములకు గుంటల లెక్కన రిజిస్ట్రేషన్ చేయడం లేదని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే నివాసప్రాంతాల భూములకు కూడా గుంటల చొప్పున రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించిన అధికారులు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



ఇంటి యజమానితో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 30: జిల్లా కేంద్రంలోని హమాలీవాడ హనుమాన్ దేవాలయం సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్, డీఈ కైసర్, ఏడీఈ వేణుగోపాల్‌లతో కలిసి శుక్రవారం పరిశీలించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలను పక్కకు జరపకపోవడంతో 60 ఫీట్ల రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యంపై 'విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించరూ' అనే శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనం ప్రచురితమైంది. పనులకు అడ్డంకిగా మారిన సదరు భవనం యజమానితో ఎస్‌ఈ మాట్లాడారు. అనంతరం ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ బిల్డింగ్ పై అంతస్తును కొంత తొలగిస్తేనే ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు, స్తంభాల తొలగింపు పనులు జరుగుతాయన్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులతో చర్చిస్తామన్నారు.

ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

బెల్లంపల్లి, ఆగస్టు 30: ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని శుక్రవారం ఎంసీపీఐయూ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడుస్తున్నా హామీలు నెరవేర్చకపోవడం సిగ్గు చేటన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన విధంగా హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధులకు రూ.4 వేల పింఛన్‌తోపాటు దివ్యాంగులకు రూ.6 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేషన్‌కార్డులను ఇవ్వకపోవడంతో ప్రజలు సంక్షేమ పథకాలను పొందడం లేదని సూచించారు. నాయకులు రమేష్, సతీష్ పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికి రుణమాఫీ



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

బెల్లంపల్లి, ఆగస్టు 30: అర్హులైన రైతులందరికి రుణమాఫీ అవుతుందని జిల్లా వ్యవసాయాధి కారి కల్పన అన్నారు. శుక్రవారం ఆకెనపల్లిలో నిర్వహిస్తున్న రైతు రుణమాఫీ నిర్ధారణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె రైతులతో మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతులు కుటుంబ నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. కుటుంబంలోని అందరు ఆధార్ కార్డులను అనుసంధానం చేసుకుని వ్యసాయాధికారితో ఫొటో దిగాలన్నారు. రుణమాఫీలో సందేహాలుంటే వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. ఏవో ప్రేమ్‌కుమార్, ఏఈవోలు పాల్గొన్నారు.

రైతుకు ఆర్థిక సహాయం

కోటపల్లి, ఆగస్టు 30: సిర్సాలో రెండు రోజుల క్రితం రెండు కాడెద్దులు ఆకస్మాత్తుగా మృతిచెందిన ఘటనలో బాధిత రైతు టేకం రాజయ్య కుటుంబానికి శుక్రవారం గ్రామస్థులు ఆర్థిక సహాయం అందించారు. కాడెద్దులు మృతి చెందడంతో గ్రామంలోని కాపువాడకు చెందిన పలువురు రూ. 48 వేలు జమ చేసి బాధిత కుటుంబానికి అందించారు.

బీజేపీ పటిష్టానికి కృషి చేయాలి



తాండూర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

బెల్లంపల్లి(తాండూర్), ఆగస్టు 30: నాయకులు, కార్యకర్తలు బీజేపీ పటిష్టానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, తాండూర్ మండల ఇన్‌చార్జి అమురాజుల శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు భరత్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బూత్‌స్థాయిలో కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. కృష్ణదేవరాయలు, చిరంజీవి, శేషగిరి, కుమార్, విగ్నేష్, ప్రవీణ్, బాపు పాల్గొన్నారు.

దండేపల్లి: బీజేపీ సభ్యత్వ నమోదును పకడ్బందీగా నిర్వహించాలని మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, సభ్యత్వ నమోదు మండల కన్వీనర్ కర్నాల కిషన్‌లు కోరారు. పార్టీ కార్యాలయంలో బూత్ కన్వీనర్, కోకన్వీనర్‌లతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదులో ప్రతీ బూత్ నుంచి 200 మందికి తగ్గకుండా చూడాలన్నారు. గుండ ప్రభాకర్, సురేందర్, పత్తిపాక సంతోష్, వనపర్తి రాకేష్ పాల్గొన్నారు.

వేమనపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని పార్టీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ పేర్కొన్నారు. వేమనపల్లిలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ గెలుపునకు కలిసికట్టుగా పని చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. నాయకులు వెంకటేష్, శ్రీకాంత్, పోచన్న, పుల్లయ్య, లస్మయ్య, స్వామి, సుధాకర్, పాల్గొన్నారు.

కోటపల్లి: మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు మంత్రి రామయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రధా న కార్యదర్శి దుర్గం అశోక్ పార్టీ నాయకులకు సభ్యత్వంపై దిశ నిర్దేశం చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, మండల ఇన్‌చార్జి నాగేశ్వర్‌రావు, మండల ఉపాధ్యక్షుడు పున్నంచంద్ పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

రామకృష్ణాపూర్, ఆగస్టు 30: నిత్యావసర ధరలను నియంత్రించాలని సెప్టెంబరు 2న చేపట్టిన ఛలో కలెక్టర్ ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని, సరుకుల ధరలను తగ్గించాలని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. మిట్టపెల్లి శ్రీనివాస్, కమలమ్మ, జంగాపెల్లి సత్యనారాయణ, గురవయ్య, పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం

ఏసీసీ, ఆగస్టు 30: మానవ సేవా సమితి ఆధ్వర్యంలో తల్లిదండ్రులను కోల్పోయిన మందమర్రికి చెందిన అక్కాచెల్లెల్లు అర్చన, అభిలాషినిలకు రూ.25 వేల ఆర్థిక సహాయం అందించారు. శుక్రవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్లను మానవ సేవా సమితి సభ్యులు, ఉపాధ్యాయులు వాణిశ్రీ, లీలారాణి, జ్యోత్స్నలు బాలికలకు అందజేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉండి సమాజంలోని అట్టడుగు వర్గాలకు సేవ చేయాలని మానవ సేవా సమితి సంస్థ ఏర్పాటు చేశామన్నారు.

దండేపల్లి: కోర్విచెల్మ(రాజంపేట)కు చెందిన వృద్ధుడు పీసరి లచ్చన్నకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు నెలలకు సరిపడా సరుకులతో పాటు బియ్యం బస్తాను అందజేశారు. కట్ట వెంకటేష్, చెన్నవేని భానుప్రసాద్, ఆకుల నవీన, శోభన, సుజాత, శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం

వేమనపల్లి, ఆగస్టు 30: వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పండ్ల తోటల పెంపకానికి లబ్ధిదారులను గుర్తించి పనులను ప్రారంభించాలని సూచించారు. కొత్తగా నర్సరీల కోసం స్థలం ఎంపిక చేయాలన్నారు. పంచాయతీ రికార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

జైపూర్, ఆగస్టు 30: విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మంచి భోజనం అందించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని టీఎస్ డబ్ల్యూఆర్ కోటపల్లి గురుకుల బాలుర కళాశాల, పాఠశాలను సందర్శించారు. వంటగదిని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న ఎలక్టోరల్ ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించి తప్పులు లేకుండా ఓటరు లిస్టును తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు, కంప్యూటర్ ఆపరేటర్లకు సూచించారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, వార్డెన్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రొడ్డ రమేష్ వర్ధంతి

కాసిపేట, ఆగస్టు 30 : ఆదివాసీ హక్కుల కోసం పోరాటం చేసిన కార్మిక సంఘం నాయకులు రొడ్డ రమేష్ వర్ధంతిని శుక్రవారం దేవాపూర్‌లో ఆదివాసీ సంఘాల నాయకులు నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమ్ముల బాపు, ఆడె జంగు, రాజన్న, శంకర్, బద్ది శ్రీనివాస్, పల్లెమల్లయ్య, ప్రభాకర్, పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 30: వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నస్పూర్ మున్సిపల్ కమిషనర్ సతీష్, 17వ వార్డు సభ్యుడు మేకల దాసు అన్నారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. దోమలు వృద్ధి చెందకుండ చర్యలు చేపట్టాలన్నారు. నిల్వ ఉన్న నీటిని పారబోయాలని సూచించారు. అనంతరం పలు వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కౌన్సిలర్ దాసు సమస్యల గురించి కమిషనర్ దృష్టికి తీసుకుపోయారు. కటిక దుకాణం నుంచి పోచమ్మ గుడి వరకు రోడ్డు అస్తవ్యస్తంగా ఉందని, మరమ్మతులకు చర్యలు చేపట్టాలని కోరారు. జవ్వాజీ మల్లేష్, వెంకన్న, దొమ్మేటి నర్సయ్య, మొగురం తార, బొగ ఉమ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నస్పూర్: నస్పూర్ మున్సిపాలిటీలోని వార్డుల్లో శుక్రవారం ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో కూలర్లు, టైర్స్, పాత ప్లాస్టిక్ సామాన్లు, డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. ఇంటి పరసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజన్‌లో వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ చిట్యాల సతీష్ కోరారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ గెల్లు రజిత, కమిషనర్ చిట్యాల సతీష్, కౌన్సిలర్లు, ఏఎన్ఎంలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ 2వార్డు జ్యోతి నగర్ ఏరియాలో ఫ్రైడే సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ వార్డు కౌన్సిలర్ పుల్లూరు సుధాకర్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసర ప్రాంతాలలో నీళ్ల నిలువ ఉండకుండా చూసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని, దోమలు ప్రబలకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో దోమల మందు, బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నామని తెలిపారు. వార్డు ఆఫీసర్ నరేందర్, ఆశా కార్యకర్త వెంకటలక్ష్మి, ఆర్పి ముంతాజ్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్, సతీష్, ఎల్లయ్య, రాజమల్లు, గణేష్, నరేష్, శ్రీనివాస్, వరదరాజు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల యజమానులకు జరిమానా

భీమారం, ఆగస్టు 30 : మండల కేంద్రంలోని హైవేకు ఇరువైపులా ఉన్న దుకాణాల ఎదుట అపరిశుభ్రంగా ఉండడంతో డీపీవో వెంకటేశ్వర్లు జరిమానా విధించారు. ఎస్‌బీఐ బ్యాంకు పక్కన ఉన్న లక్ష్మణ్ గ్యారేజీకి రూ.5 వేలు, శ్రీలక్ష్మీఫెర్టిలైజర్, శ్రీరామ ఫెర్టిలైజర్, సంతోషిమాత స్పేర్‌పార్ట్స్, సంతోష్ కిరాణం ఒక్కో దుకాణానికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తను పంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు అందించాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్త పడేస్తే చర్యలుంటాయన్నారు. వ్యాధులు రాకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, సిబ్బంది ఉన్నారు.

యూడైస్ ఓరియంటేషన్‌పై అవగాహన

కోటపల్లి, ఆగస్టు 30: యూడైస్ ఓరియంటేషన్‌పై శుక్రవారం పాఠశాలల ప్రధానోపాధ్యా యులకు, కళాశాలల ప్రిన్సిపాళ్లకు క్లస్టర్ లెవల్‌లో అవగాహన నిర్వహించారు. స్కూల్, టీచర్, స్టూడెంట్ ఇన్‌ఫర్మేషన్ ఏ విధంగా చేయాలి, పాఠశాల వసతులు, సౌకర్యాల వివరాలు ఫారంలో ఏ విధంగా నింపాలనే విషయాలపై జిల్లా విద్యాధికారి యాదయ్య, ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ఎఎస్‌సీ రాజ్‌కుమార్, ఏపీవో రాములు జూమ్ ద్వారా వివరించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు, సీసీవోలు, ఎంఐఎస్‌వోలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలి

మందమర్రిరూరల్, ఆగస్టు 30 : విద్యార్థులు క్రమశిక్షణ కలిగి చదువులో రాణించాలని సైకియాట్రిస్టు డాక్టర్ సునీల్ పేర్కొన్నారు. శుక్రవారం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువు, పరీక్షలంటే టెన్షన్ పడుతుంటారని, అలా కాకుండా ప్రణాళికబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, లెక్చరర్లు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను చైతన్యం చేసేందుకే సదస్సు



మందమర్రిటౌన్, ఆగస్టు 30: విద్యార్థులకు విద్యతో పాటు సమాజ శ్రేయస్సుపై 2న ఎండోమెంట్ ఎడ్యుకేషన్ లెక్చర్ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని కార్మెల్ పాఠశాల, కళాశాల నిర్వాహకులు జేవీఆర్ రెక్స్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మందమర్రి పాఠశాల ఏర్పాటు చేసి ఆరు దశాబ్దాలు పూర్తయ్యాయన్నారు. ఇదే పాఠశాలలో చదివిన మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్, రాజకీయ విశ్లేషకుడు నాగేశ్వర్‌రావు సదస్సుకు హాజరవుతారని తెలిపారు. విద్యార్థులకు అన్ని విషయాలపై అవగాహన కల్పించడానికి సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు, లెక్చరర్లు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని అఖిలపక్షం రాస్తారోకో

తిర్యాణి, ఆగస్టు 30: ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రెండులక్షల రుణమాఫీ చేయాలని శుక్రవారం మండల కేంద్రంలోని కుమరంభీం చౌరస్తాలో అఖిలపక్షం నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకు రెండులక్షల రుణమాఫీ చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ సునీల్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భగవంత్‌రావు, చంద్రశేఖర్, శ్రీనివాస్, గుణవంతరావు, రమేష్‌గౌడ్, వెంకటేష్, రమేష్, సత్యనారాయణ, సత్తయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న అఖిలపక్షం నాయకులు

మందులు అందుబాటులో ఉంచాలి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్, ఆగస్టు 30: ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు కావాల్సిన మందులు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని శుక్రవారం డీఎంహెచ్‌వో తుకారాం భట్‌కు డీవైఎఫ్‌ఐ, టీపీజీఎస్, కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లావ్యాప్తంగా డెంగ్యూ, మలేరియా తీవ్రస్థాయిలో ఉండడంతో వ్యాధులకు రోగులు బలవుతున్నారన్నారు. జిల్లాలో హెల్త్‌ఎమర్జెన్సీ ప్రకటించి గ్రామగ్రామాన మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో దినకర్, టికానంద్, మాల, రాజేందర్, శ్రీనివాస్, నిఖిల్, తిరుపతి పాల్గొన్నారు.

ముస్లింల నిరసన ర్యాలీ

సిర్పూర్(టి), ఆగస్టు 30: తమ మత గురువుపై మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ ముస్లింలు శుక్రవారం మండలకేంద్రంలోని డౌనల్‌ఏరియా మజీద్‌నుంచి నిరసనర్యాలీ నిర్వహించారు. శాంతియుతంగా పోలీసుస్టేషన్‌వరకు ర్యాలీ నిర్వహించి పోలీసుస్టేషన్‌లో వినతి పత్రం అందజేశారు. ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా చూడాలని కోరారు.



సిర్పూర్(టి)లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

చింతలమానేపల్లి, ఆగస్టు 30: మండలంలో కర్జవెల్లి నుంచి లక్షెట్టిపేటకు శుక్రవారం అక్రమంగా పికప్‌వ్యాన్‌లో తరలిస్తున్న నాలుగు ఎద్దులను పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కర్జవెల్లి నుంచి డబ్బాగ్రామం మీదుగా ఎలాంటి రసీదులు లేకుండా ఎడ్లను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వాహనాన్ని సీజ్‌చేసి డ్రైవర్ సయ్యద్ అజీమొద్దీన్, గూడెం దండెపల్లికి చెందిన తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'పార్టీ పటిష్టతకు కృషిచేయాలి'

కౌటాల, ఆగస్టు 30: నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సమీర్ గుప్తా అన్నారు. శుక్రవారం ఆరె సంక్షేమ భవనంలో ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయాలని, విస్తృత స్థాయిలో సభ్యత్వనమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వాసుపటేల్, మృత్యుంజయ్, కవిరాజ్, సత్తయ్య పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ప్రఖండ కమిటీ

దహెగాం, ఆగస్టు 30: మండలకేంద్రంలోని శివకేశవ ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ప్రఖండ కమిటీని జిల్లా అధ్యక్షుడు రేపెల్లి రాజయ్య, కార్యదర్శి వేములరమేష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. అధ్యక్షుడిగా రఘోత్తంరెడ్డి, ప్రధానకార్య దర్శిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా చందు, మహిళా ఉపాధ్యక్షురాలిగా అనిత, కోశాధికారిగా ప్రశాంత్, సత్సంగ్ ప్రముఖ్‌గా శంకర్, గోసేవ ప్రముఖ్‌గా సత్యనారాయణ, ధర్మప్రచార ప్రముఖ్‌గా ప్రదీప్, సహాయ ప్రముఖ్‌లుగా శ్రీనాథ్, రాజు, మల్లేష్, సుమిత్, శ్రీనివాస్, విజయ్, గుండయ్య, శ్రీనివాస్ తదితరులను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు నోటు బుక్కులు పంపిణీ

పెంచికలపేట(దహెగాం), ఆగస్టు 30: పెంచికలపేట మండలం గుంట్లపేట ప్రాథమికపాఠశాలలో శుక్రవారం మిషన్‌భగీరథసిబ్బంది మల్లేష్, పెంటయ్య సహకారంతో విద్యార్థులకు సామాజికకార్యకర్త చప్పిడి ప్రకాష్ నోటుబుక్కులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ తేజ్వని, గుండయ్య, దనేష్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలపై విచారణ

రెబ్బెన, ఆగస్టు 30: మండలంలోని గోలేటి గ్రామపంచాయతీలో శుక్రవారం డీఆర్డీఏ పీడీ దత్తారావు మరుగుదొడ్లు, ఇంగకుడు గుంతల నిర్మాణాలపై విచారణ చేపట్టారు. ఈసందర్భంగా లబ్ధిదారులను కలిసి మరుగుదొడ్డి ఎప్పుడు నిర్మించుకున్నది, ఎంతబిల్లు మంజూరైందనే విషయంపై వాకబుచేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి బోగే ఉపేందర్ విచారణకు వచ్చిన అధికారులతో మాట్లాడారు. మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలనిర్మాణాలపై సమగ్రవిచారణజరిపి బాధ్యులపైచర్యలు తీసుకోవాలనికోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరమ్మ,తహసీల్దార్ రాంమోహన్‌రావు, తదితరులున్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● జూనియర్ సివిల్ జడ్జి అజయ్ ఉల్లం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి అజయ్ ఉల్లం

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 30: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిర్పూర్ (టి) జూనియర్ సివిల్ జడ్జి అజయ్ ఉల్లం అన్నారు. కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు.. ప్రతిఒక్కరూ చట్టాలు, న్యాయ విజ్ఞానం పెంపొందించుకునేలా చూడాలన్నారు. విద్యాహక్కు చట్టం, చట్టాలపై అవగాహన, రాజ్యాంగం కల్పించే హక్కులు, తదితర విషయాలపై వివరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ పార్వతి, బార్ అసోషియేసన్ అధ్యక్షుడు వి కిషోర్‌కుమార్, కాగజ్‌నగర్ టౌన్ సీఐ శంకరయ్య, న్యాయవాదులు శంకర్‌రావు, గణపతి, కళ్యాణ్, ఏజీపీ సిహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ప్రత్యేకాధికారి

పెంచికలపేట(దహెగాం), ఆగస్టు 30: పెంచికలపేట మండలంలో ఎల్లూరు ఆశ్రమపాఠశాల ప్రత్యేకాధికారి ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ మెనూప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని అడిగితెలుసుకున్నారు. అనంతరం ఎల్కపల్లి కేజీబీవీలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సందర్శించారు. అలాగే ఎల్లూరు ఐకేపీ ద్వారా నిర్మించిన ఫిష్‌పాండ్‌ను సందర్శించి చేపల నిర్వహణ గురించివివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరంమండలంలోని పలుగ్రామాలను సందర్శించి వివరాలుతెలుసుకున్నారు. ఆయనవెంట ఎంపీడీవో ఆల్బర్ట్, ఏపీఎం కొమురయ్య, కార్యదర్శి కిష్టయ్య, చంద్రశేఖర్, ఎఫ్ఏ ప్రేమానందంఉన్నారు.

గంజాయి కేసులో పలువురి అరెస్టు

కాగజ్‌నగర్, ఆగస్టు 30: కాగజ్‌నగర్‌లో గంజాయి విక్రయిస్తున్న పలువురిని శుక్రవారం పట్టుకొని కేసు నమోదుచేసినట్టు టాస్క్‌ఫోర్సు సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నజ్రూల్‌నగర్ విలేజీనం.1గ్రామంలో రాజ్‌కుమార్ సర్కార్‌ఇంట్లో తనిఖీచేయగా, 55గ్రాముల గంజాయి లభ్యమైందన్నారు. ఈమేరకు రాజ్‌కుమార్, భోషంలా, అతీక్, కార్తీక్, హుస్సేన్‌ను అరెస్టు చేసినట్టు తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

కెరమెరి, ఆగస్టు 30: మండలంలోని గోయగాం శివాలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హోమ కార్యక్రమం నిర్వహించగా పలు జంటలు పాల్గొని పూజలు నిర్వహించాయి. కార్యక్రమంలో గ్రామస్థులు శంకర్, లక్ష్మణ్, సోనాజీ, పోశెట్టి, పాండురంగ్, బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

పూలాజీ బాబా జయంతి

సిర్పూర్(యు), ఆగస్టు 30: మండల కేంద్రంలోని పూలాజీబాబా ధ్యానమందిరంలో శుక్రవారం పూలాజీబాబా జయంతి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. బాబా చిత్రపటానికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ ఆత్రం భగవంత్‌రావు మాట్లాడుతూ బాబా చూపిన మార్గంలో నడవాలని అన్నారు. కార్యక్రమంలో మండలకేంద్రంతో పాటు భూర్నూర్, కోహినూర్, భూర్నూర్(కె) తదితర గ్రామల భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

కాగజ్‌నగర్, ఆగస్టు 30: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అదనపు కలెక్టర్(రెవిన్యూ) దాసరి వేణు అన్నారు. శుక్రవారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వంటగదులు, భోజనశాల, తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

తాగుడుకు బానిసై యువకుడు ఆత్మహత్య



రామయ్య(ఫైల్)

బెజ్జూరు, ఆగస్టు 30: మండలంలోని మద్దిగూడ గ్రామానికి చెందిన నైతం రామయ్య(24) ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై విక్రం తెలిపిన వివరాల ప్రకారం.. రామయ్య పనిపాట లేకుండా నిత్యం తాగుతూ మద్యానికి బానిసయ్యాడు. జులాయిగా తిరుగుతూ మద్యం మత్తులో పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలో వెళ్లాడు. సోదరుడు సుబ్బారావు ఇంటికివచ్చి చూడగా రామయ్య అపస్మారకస్థితిలో కనిపించడంతో వెంటనే తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి చూసే సరికి అప్పటికే మృతిచెందాడు. మృతుడి తండ్రి భుజంగరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వెలిగి ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం

వాంకిడి, ఆగస్టు 30: మండలంలోని వెలిగి గ్రామంలో, ఆశ్రమపాఠశాలలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో రవిదాస్, ఏఎన్ఎం సుమిత, కార్యదర్శి నితీష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

లింగాపూర్, ఆగస్టు 30: మండలంలోని గాన్నుగూడా గ్రామానికి చెందిన ఆత్రం జంగు అనే రైతు కొద్ది రోజుల క్రితం రోడ్డుప్రమాదంలో గాయపడగా శుక్రవారం రెహమాన్ ఫౌండేషన్ సభ్యులు వారిని పరామర్శించి ఐదువేల రూపాయలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో సభ్యులు జాటోత్ దవిత్ కుమార్, దవనే విశ్వకాంత్, జాదవ్ మారుతి పాల్గొన్నారు.



పొలాల అమావాస్యకు సెలవు ఇవ్వాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 30: పొలాల అమావాస్య పండుగ పురస్కరించుకుని సెప్టెంబరు 2 నుంచి మూడు రోజులు ప్రభుత్వం సెలవు దినాలుగా ప్రకటించాలని శుక్రవారం నేతకాని ఉద్యోగుల రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు కలెక్టరేట్ కార్యాలయం ఏవోకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ పొలాల అమావాస్య పండగను నేతకానిలు పవిత్రంగా జరుపుకుంటారని తెలిపారు. నేతకాని ఉద్యోగులకు, విద్యార్థులు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో అనూష, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నేడు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటన

- 11 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంటు ప్రారంభం
- హెలీప్యాడ్, శంకుస్థాపన స్థలాలను పరిశీలించిన సీపీ, అధికారులు

చెన్నూరు, ఆగస్టు 30: సింగరేణి సంస్థ ఆధ్వ ర్యంలో చెన్నూరులో సౌర వెలుగులు విరజిమ్మనున్నాయి. శివలింగాపూర్ గ్రామ సమీపంలో సోలార్ పవర్ ప్లాంటు నిర్మాణం పూర్తవగా శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభానికి సిద్ధమైంది. మూతపడిన బొగ్గు గని సమీపంలో సోలార్ పవర్ ప్లాంటు నిర్మాణానికి సింగరేణి సంస్థ 70 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఇందులో సుమారు రూ.67 కోట్లతో 11 మెగా వాట్ల సోలార్ పవర్ ప్లాంటు నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ పనులను పూణెకు చెందిన ఎన్‌రిచ్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. నిర్వహణ పనులు గతేడాది ప్రారంభించారు.చుట్టూ ప్రహరీ నిర్మాణం, ముఖద్వారం పనులు పూర్తి చేయగా లోపల 50 ఎకరాల్లో సోలార్ ప్లేట్ లను బిగించారు. ఈ పవర్ ప్లాంటు ద్వారా వచ్చే విద్యుత్ ఉత్పత్తిని కిష్టంపేటలోని 132 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి అనుసంధానం చేశారు.

ఏర్పాట్లు పరిశీలించిన సీపీ

శివలింగాపూర్‌లో సోలార్ పవర్ ప్లాంటు ప్రారంభానికి వస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యట నకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌తో కలిసి పవర్ ప్లాంట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. మూడంచెల భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. సభా స్థలి వద్ద ఏర్పాట్లు, పార్కింగ్ తదితర విష యాలపై చర్చించారు. ఎలాంటి పొర పాట్లకు తావివ్వకూడద న్నారు. సభాస్థలిని బాంబు, డాగ్ స్క్వాడ్‌తో పరిశీ లిస్తు న్నారు. మంచిర్యాల ఆర్డీవో రాములు, సింగరేణి జీఎం శ్రీనివాసరావు ఏర్పాట్లను పరిశీలించారు.

పటిష్ట బందోబస్తు



ఎస్టీపీపీలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న రామగుండం సీపీ శ్రీనివాస్

జైపూర్: జిల్లాలో డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటనకు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఎస్టీపీపీలోని హెలిప్యాడ్, శంకుస్థాపన ప్రాంతాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పర్యటించే ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. పలు ప్రాంతాల నుంచి బహిరంగ సభకు వచ్చే వాహనాలకు, ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ మోహన్, ఎస్ఐ శ్రీధర్, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిబంధనలు బేఖాతరు

అత్యవసర చికిత్సకు మంచిర్యాల జిల్లా కేంద్రం అందుబాటులో ఉంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌తోపాటు కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి వైద్యం కోసం వస్తుంటారు. దీంతో వ్యాపారుల చూపు వైద్య రంగంపై పడింది. మల్టీస్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ పేర్లతో ప్రైవేటు ఆసుపత్రులు వెలుస్తున్నాయి. వైద్య పరంగా ఎలాంటి అనుభవం లేని వారు సైతం పెట్టుబడులు పెట్టి కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ఆసుపత్రులు నిర్వహిస్తున్నా, అధిక ఫీజులు వసూలు చేస్తున్నా అడిగేవారే కరువయ్యారు.

- మల్టీ, సూపర్ స్పెషాలిటీ పేరుతో ఆసుపత్రులు
- నిపుణులైన వైద్యులు లేకుండానే నిర్వహణ
- అందినకాడికి దండుకుంటున్న వైనం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 30: జిల్లాలోని బడా వ్యాపారులు వైద్యరంగాన్ని వ్యాపార రంగంగా మార్చేశారు. జిల్లాలో మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ పేర్లతో ప్రైవేటు ఆసుపత్రులు వెలిశాయి. జిల్లా కేం ద్రంలో సు మారు 120 ఆసుపత్రులుండగా ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాల్లో మరో 125 ఆసుపత్రులు మొత్తంగా జిల్లా వ్యాప్తంగా 245 ఆసుపత్రులున్నాయి. నూతనంగా ఏర్పాటవుతున్న పలు ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు లేవు. మరికొన్ని ఆసుపత్రుల్లో సౌకర్యాలున్నా నిపుణులైన వైద్య సిబ్బంది ఉండటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని ఆసుపత్రుల్లో 24 గంటలు నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటారనే బోర్డులను ఏర్పాటు చేస్తున్న ప్పటికీ సంబంధిత వైద్యులు లేకపోగా విజిట్ డాక్టర్లు, ఎలాంటి స్పెషలైజేషన్ లేకుండా కేవలం ఎంబీబీఎస్ పూర్తి చేసిన డ్యూటీ డాక్టర్లతోనే వైద్యం అందిస్తున్నారు. చిన్న చిన్న అనారోగ్య సమస్యలు వచ్చినవారు ఆసుపత్రులకు వెళ్తే వారికి అనవసరమైన పరీక్షలు, మందులు రాస్తూ దోపిడీకి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. మరికొన్ని ఆసుప త్రుల్లో సరైన నిపుణులు లేకున్నా రెండు, మూడు రోజులు అడ్మిట్ చేసుకొని అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్, హైదరాబాద్‌కు రెఫర్ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ ఆసుపత్రుల్లో చేరి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఆర్‌ఎంపీలు, అంబులెన్స్ డ్రైవర్లను సదరు ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు వారికి కమీషన్లను ఆశగా చూపిస్తూ ఆసుపత్రులకు రోగులను రప్పించుకుంటున్నారు. ఆసుపత్రులకు తీసుకువచ్చే కేసు తీవ్రతను బట్టి, వైద్యానికి అయ్యే ఖర్చును బట్టి 10 నుంచి 30 శాతం మేర కమీషన్లు ముట్టజెప్తున్నట్లు సమాచారం. ధనార్జనే ధ్యేయంగా కొనసాగుతున్న ఆసుపత్రుల నిర్వాహకులు, కమీషన్లకు కక్కుర్తిపడే ఆర్‌ఎంపీలు, అంబులెన్స్ డ్రైవర్లు చేసే నిర్వాకం వల్ల అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందక అనేక మంది మృత్యువాత పడుతున్నారు.

నిబంధనలు బేఖాతరు

ఐపీ సేవలందించే ఆసుపత్రులను ఏర్పాటు చేయా లంటే విశాలమైన భవనాలు, రోగులకు అన్ని రకాల సౌక ర్యాలు, ఐసీయూ, జనరల్ వార్డులు, అత్య వసర సేవ లందించే అసుపత్రుల్లో అధునాతన సౌకర్యాలతోపాటు వెంటిలేటర్ సౌకర్యాలు అందు బాటులో ఉండాలి. సౌకర్యాలకు తగ్గట్లుగానే క్వాలిఫైడ్ డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాల్సి వుంటుం ది. చాలా ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు కూడా లేకుండా చిన్న చిన్న భవనాల్లో, ఇరుకు గదు ల్లో నిర్వహిస్తున్నారు. ఫైర్ సేఫ్టీ నిబం ధనలు కూడా పాటించడం లేదు.

పట్టించుకోని అధికారులు

ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘిస్తూ తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నప్పటికీ సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు న్నాయి. ఏదైన సంఘటన జరిగినప్పుడు రెండు, మూడు రోజులు మాత్రమే హంగామా చేస్తూ ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. సదరు ఆసుపత్రుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడంలో, వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు నామమాత్రంగా వ్యవహరించడంపై వారికి మామూళ్లు అందుతుండటంతోనే చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు

డాక్టర్ హరీష్ రాజ్, డీఎంహెచ్‌వో



జిల్లాలో నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటాం. జిల్లాలో 5 టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నాం. ప్రతీ టీంకు హెడ్‌గా డిప్యూటీ డీఎంహెచ్‌వో, ప్రోగ్రాం ఆఫీసర్‌లను నియమిస్తున్నాం. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులను పరిశీలించి నిబంధనలు పాటించని, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టుకు విరుద్ధంగా నడుస్తున్న, రెన్యూవల్ చేసుకోని ఆసుపత్రులకు నోటీసులను జారీ చేస్తాం. వాటిని సరిచేసుకోకుంటే సదరు ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటాం.

మంచిర్యాల నియోజకవర్గంలో కానరాని మున్సిపల్ సమావేశాలు

మంచిర్యాల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని మున్సిపాలిటీల్లో సాధారణ సమావేశాలు జరగడం లేదు. మంచిర్యాల, నస్పూర్, లక్సెట్టిపేట పురపాలక సంఘాల్లో రెండు నెలలుగా సమావేశాలు నిర్వహించకపోవడంతో పాలన అటకెక్కింది. పారిశుధ్యం, వీధి దీపాలు, సిల్ట్ తొలగింపు వంటి పనులు చేయించలేక కౌన్సిలర్లు ముఖం చాటేస్తున్నారు. నాలుగు నెలల్లో పాలకవర్గం పదవీకాలం ముగుస్తున్నా ఎక్కడి పనులు అక్కడే అన్న చందంగా పరిస్థితులు మారాయి. తమ ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితి ఉందని ప్రజాప్రతినిధులే బహిరంగంగా పేర్కొంటున్నారు.

కాగా, మున్సిపల్ సమావేశాలు జరగకపోవడంపై మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్‌ను అడుగగా గతనెల సమావేశానికి ఎమ్మెల్యే హాజరవుతారని, చివరికి సమయం ఇవ్వకపోవడంతో కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసుకోలేదన్నారు. పాలకవర్గ సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకొంటానని పేర్కొన్నారు.

శిశుమందిర్‌లో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

హాజీపూర్, ఆగస్టు 30: పడ్తన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చొక్కా రాంనగర్‌లోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 31, సెప్టెంబరు 1, 2 తేదీల్లో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు సరస్వతి శిశుమందిర్ విద్యాపీఠం తెలంగాణ సంఘటన కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటారని, ఇందులో గెలిచిన వారు కర్ణాటకలో జరిగే పోటీల్లో పాల్గొంటారని, అక్కడ గెలుపొందిన క్రీడాకారులు ఆలిండియా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సీతారాములు, కృష్ణమాచార్యులు,భీమ్‌సేన్‌రావు, పాల్గొన్నారు.

లంబాడా కులం సర్టిఫికెట్ ఇవ్వాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 30 : లంబాడా కులం సర్టిఫికెట్ ఇవ్వాలని శుక్రవారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు లంబాడా జేఏసీ జిల్లా అధ్యక్షుడు సబావాట్ శంకర్ వినతిపత్రం అందించారు. కాసిపేట మండలంలో 1977 నుంచి ఓటరు ఐడీ రికార్డు, భూమి రికార్డు, ఇంటి నెంబరు, ఏదైనా పాత రికార్డు తీసుకుని సర్టిఫికెట్ ఇస్తున్నామని తహసీల్దార్ పేర్కొన్నారని తెలిపారు. సర్టిఫికెట్‌లు ఆలస్యం కావడంతో చాలా మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫిజికల్ ఎంక్వైరీ చేసి సర్టిఫికెట్‌లు ఇవ్వాలని కలెక్టర్‌కు విన్నవించారు. ప్రకాష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ సర్వే

జన్నారం, ఆగస్టు 30: దేవునిగూడ గ్రామంలో రుణమాఫీ పథకంలో రేషన్ కార్డు లేని రైతులకు కుటుంబ సభ్యుల ధ్రువీకరణ సర్వేను వ్యవసాయాధికారులు నిర్వహించారు. రేషన్ కార్డు లేని వారికి మాత్రమే సర్వే చేస్తున్నామని ఏఈవో అక్రముల్లా తెలిపారు.

ఇసుక సమస్య పరిష్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

బెల్లంపల్లి, ఆగస్టు 30: రెండు నెలలుగా ఇసుక సమస్యతో ఉపాధి దొరకడం లేదని, సమస్యను పరిష్కరించాలని శుక్రవారం కాంటా చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ రెండు నెలలుగా మైనింగ్ అధికారులు ఇసుక ఆన్‌లైన్ ఇవ్వని కారణంగా ఇంటి నిర్మాణాలు జరగడం లేదన్నారు. దాదాపు 2 వేల మంది కూలీలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. సమస్యపై అధికారులు పరిష్కారం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెన్నెల మండలం ఖర్జీలోని ఇసుక రీచ్ వద్ద చెక్‌డ్యాం నిర్మాణంతో ట్రాక్టర్లు వెళ్లే దారిలో నీరు నిలిచి ఇసుక రవాణాకు ఆటంకం ఏర్పడిందన్నారు. ర్యాలీ అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. సంఘం అధ్యక్షుడు రాంకుమార్, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధిక ధరలను నియంత్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

శ్రీరాంపూర్, ఆగస్టు 30: అధిక ధరలను నియంత్రించాలని 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, కౌన్సిలర్ మేకల దాసు తెలిపారు. శుక్రవారం శ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నస్పూర్ మున్సిపాలిటీలో సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. 5వ వార్డు, 17వ వార్డులోని హిమ్మత్‌నగర్‌లో కొందరికి, ఆర్‌కే-8 కాలనీ, భగత్‌సింగ్ నగర్, సుందరయ్య నగర్, కృష్ణకాలనీ ప్రాంత వాసులకు ఇవ్వలేదన్నారు. స్థలాలను రెవెన్యూ శాఖకు అప్పగించి పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యదర్శి పూజారి రామన్న, సహాయ కార్యదర్శి మహేష్, జక్క మొగిలి, శ్రీనివాస్, రాజేశ్ పాల్గొన్నారు.

బీసీ కుల గణన చేపట్టాలి



నిరసన తెలుపుతున్న బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 30: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణనను చేపట్టాలని శుక్రవారం బీసీ సంఘాల జేఏసీ నాయకులు ఐబీ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే కుల జన గణన చేపడతామని హామీఇచ్చి మరచిపోయిందన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. నాయకులు వడ్డేపల్లి మనోహర్, గుమ్ముల శ్రీనివాస్, కొండయ్య, రాజేశం, రామదాసు, చంద్రకాంత్, అఖిల్, ఓదెలు, నాగరాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

బెల్లంపల్లి మున్సిపల్ సమావేశం



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న మున్సిపల్ కమిషనర్

బెల్లంపల్లి, ఆగస్టు 30: తాగునీటి సమస్య పరిష్కరించాలని కౌన్సిలర్లు కలెక్టర్ కుమార్ దీపక్‌కు విన్నవించారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం వాడివేడీగా సాగింది. సమావేశానికి కలెక్టర్ కుమార్ దీపక్ హాజరయ్యారు. పట్టణంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కొన్ని వార్డుల్లో వారానికి ఒకసారి తాగునీరు వస్తుందని కౌన్సిలర్ దామెర శ్రీను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. రిటైర్డు సింగరేణి కార్మికుల క్వార్టర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని, దీంతో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ పేర్కొన్నారు. కూరగాయల మార్కెట్ స్టాళ్ల కేటాయింపులో అనర్హులకు అవకాశం కల్పించారని, పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. ప్రజలు జ్వరాల బారిన పడుతున్నప్పటికీ పలు వార్డుల్లో ఫాగింగ్ చేయలేదని వైస్‌చైర్మన్ ప్రశ్నించారు. వెంటనే వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. కాల్‌టెక్స్ ఏరియాలోని రైల్వే కాలనీలో ఇండ్లలోకి వర్షం నీరు చేరుతుందని, శాశ్వత పరిష్కారం చూపాలని కౌన్సిలర్లు చంద్రశేఖర్, నెల్లి శ్రీలతలు పేర్కొన్నారు. అన్ని వార్డుల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వన మహోత్సవంలో కోట్ల రూపాయలతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారే తప్ప సంరక్షణ చర్యలు తీసుకోలేదని, నిధులు వృథాగా పోతు న్నాయని చైర్‌పర్సన్‌ను కౌన్సిలర్ రాములునాయక్ నిలదీశారు. కౌన్సిల్ సభ్యుల ఆమోదంతో పలు తీర్మానాలను ఆమోదించారు. వినాయక చవితి, బతుకమ్మ పండుగల నేపథ్యంలో లైటింగ్ ఏర్పాటుకు రూ.లక్ష, వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాటుకు రూ.లక్ష, మెయిన్‌రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చడానికి రూ.2 లక్షలు, పలు వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. సింగరేణి కళావేదిక, కాల్‌టెక్స్ ఏరియాల్లో స్ట్రీట్ వెండర్ల కోసం నిర్మించిన షాపులు కేటాయించేందుకు తీర్మానించారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి అధికారులు, పాలకవర్గం సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. కలెక్టర్‌ను చైర్‌పర్సన్, కౌన్సిలర్లు సన్మానించారు. కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చిన్నారితో సమావేశానికి

మున్సిపల్ సమావేశానికి 30వ వార్డుకు చెందిన కౌన్సిలర్ భరద్వాజ్‌సుకేశిని ఏడాదిన్నర వయస్సున్న చిన్నా రితో సమావేశానికి వచ్చారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలి : కలెక్టర్

బెల్లంపల్లి, ఆగస్టు 30: వసతి గృహాల్లోని విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం తాళ్లగురిజాలలోని తెలంగాణ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల, సాంఘీక సంక్షేమ బాలుర పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి ఏమైనా సమస్యలున్నాయా అని తెలుసుకున్నారు. భోజనం చేసే సమయంలో చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని, వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. ప్రశ్నలు వేసి సమాధానాలను విద్యార్థులతో బోర్డుపై రాయించారు.

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

మంచిర్యాల కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా సమన్వయకర్త నాగేశ్వర్‌రావు, జోనల్ అధికారి అరుణకుమారితో కలిసి టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ ప్రిన్సిపాళ్లు, కరెస్పాండెంట్‌లు, భవనాల యజమానులతో సమావేశం నిర్వహించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు, నాణ్యమైన విద్యాబోధన అందించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను ఖాళీ చేసి సురక్షిత భవనాలకు తరలించాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తన తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న సీపీ

శేష జీవితాన్ని ఆనందంగా గడపాలి

పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు వారి శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని, వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. పదవీ విరమణ పొందిన ఎం.సర్కార్ (సబ్ ఇన్‌స్పెక్టర్, జన్నారం పోలీస్ స్టేషన్), వి.శంకరయ్య (హెడ్ కానిస్టేబుల్, మంథని పోలీస్ స్టేషన్)లను సీపీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సరేంద్ర, ఏఓ అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 30: పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కె.వెంకటరమణ రెడ్డి కుటుంబ సభ్యులకు శుక్రవారం సీపీ రూ.7,98,320 భద్రత చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నియంత్రణపై ప్రత్యేక కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 30: హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణకు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హరీష్‌రాజ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన దిశ కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఐవీ ఎయిడ్స్ స్క్రీనింగ్ పరీ క్షలపై పల్లె దవాఖానాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో హెచ్‌ఐవీ పరీక్షలు చేస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా చర్యలతోపాటు గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భం దాల్చిన మహిళలు తమ వివ రాలు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పిం చాలని, సకాలంలో పరీక్షలు చేసి టీకాలను వేయాలని సూచించారు. ఉప వైద్యాధికారి సుధాకర్‌నాయక్, వైద్యాధి కారులు ప్రసాద్, సీతారామరాజు, అనిత, అనిల్, డీపీవో ప్రశాంతి, ఎయిడ్స్ జిల్లా అధికారి నీలిమ రాజేష్ పాల్గొన్నారు.

ఇంటి పన్నులు వందశాతం వసూలు చేయాలి

కాసిపేట, ఆగస్టు 30 : మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఈ ఏడాది వంద శాతం పన్నులను వసూలు చేయాలని ఎంపీడీవో సత్యనారాయణసింగ్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 22 గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా పంచాయతీల వారీగా ఓటర్ల జాబితా మెర్జింగ్ స్టేట్‌మెంట్ త్వరగా తయారు చేసి టీపోల్ చేయాలన్నారు. ఓటరుజాబితా నమోదులో తప్పులు లేకుండా చూడాలన్నారు. పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలన్నారు. ఎంపీవో సఫ్దర్ అలీ, కార్యదర్శులు పాల్గొన్నారు.